ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక

ఇది కద నిజం
సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక
మీ ప్రాంతంలో జరుగుతన్న అవినీతిని బయటపెట్టాలని ఉందా..
నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా..
సంచలన కథనాలకు కేరాఫ్‌గా నిలిచిన ఇది కద నిజం
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న
ఇది కద నిజం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల
వారిగా విలేఖరులు కావలెను..
6300490170-9848983329
Www.edikadanijam.com
Edikadanijam@gmail.com
No Monthly Targets
* terms and conditions apply

శుక్రవారం 17-07-2026 | పేజీలు : 4 | వెల : 2/- | సంపుటి :2 | సంచిక :30 | www.edikadanijam.com | ఎడిటర్ : బాలరాజ్ గౌడ్

# తల్లికి వందనం నిధుల వర్షం!



- రూ.10 వేల కోట్ల నిధుల విడుదల
- 22న డీబీటీ ద్వారా జమ
- 67.47 లక్షల విద్యార్థులకు లబ్ధి
- 42.70 లక్షల తల్లులకు ప్రయోజనం
- విద్యార్థికి రూ.15 వేల సాయం
- ఆగస్టు 3 వరకు అభ్యంతరాలు
- విద్యాభారానికి ప్రభుత్వ భరోసా
- ఆర్టీఈ విద్యార్థులకూ వర్తింపు

**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రతిష్ఠాత్మక 'తల్లికి వందనం' పథకం అమలుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం.. ఈ పథకం కోసం రూ.10,120.78 కోట్ల పరిపాలనా అనుమతిని మంజూరు చేసింది. ఇందులో భాగంగా రూ.10,049 కోట్ల నిధులను విడుదల చేసింది. అర్హులైన తల్లులు లేదా సంరక్షకుల బ్యాంకు ఖాతాల్లో ఈనెల 22వ తేదీన నేరుగా డీబీటీ ద్వారా నగదు జమ చేయనున్నట్లు ప్రకటించింది.

ఈ తల్లికి వందనం పథకం 1వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న అర్హులైన విద్యార్థులకు వర్తించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 67,47,190 మంది విద్యార్థులు.. 42,70,802 మంది తల్లులు లేదా సంరక్షకులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు.

మిగతాది 2 లో..

# బీజేపీ వస్తే బొట్టు తప్పనిసరి

- స్కూల్ ఘటనపై బండి ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని డిమాండ్
- హిందూ సంస్కృతిపై వ్యాఖ్యలు
- బీజేపీ హామీపై ప్రకటన
- మజ్లిస్‌పై ప్రశ్నల వర్షం
- ప్రభుత్వ తీరుపై విమర్శలు




**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** రాష్ట్ర రాజధాని సైదాబాద్ లోని సక్సెస్ ప్రైవేట్ స్కూల్‌లో హిందూ విద్యార్థులకు కల్మా, సురా ఫతేహ్ చదవాలంటూ హోంవర్క్ ఇచ్చారన్న వివాదంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బరితెగించి బలవంతంగా హిందూ సంస్కృతిపై దాడి చేస్తున్నారని కల్మా, సూరహ్ ఫతే చదవాలని హుకుం జారీ చేయడం దుర్మార్గం అని మండిపడ్డారు. సక్సెస్ స్కూల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తాజాగా ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. ఈ ఘటనను సమాజమంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఈ ఘటనపై సెక్యూలర్ సంఘాలు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు.

# వైభవంగా బోనాల జాతర ప్రారంభం

- జగదాంబికకు తొలి బోనం
- ప్రభుత్వం తరపున బంగారు బోనం
- మంత్రుల ప్రత్యేక పూజలు
- భక్తులతో కిక్కిరిసిన గోల్కొండ



# రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

- నేతన్నలకు రూ.25 వేల సాయం
- ఆగస్టు 7న పథకం అమలు
- 55 వేల మందికి లబ్ధి
- బడ్జెట్‌లో రూ.250 కోట్లు
- సొంత మగ్గం ఉన్నవారికి వర్తింపు





**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చేనేత కార్మికులకు అదిరిపోయే శుభవార్త అందింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7వ తేదీన నేతన్నకు భరోసా స్కీం అమలు చేసేందుకు రంగం సిద్ధం చేసింది సర్కార్. ఈ మేరకు కసరత్తులు కూడా ప్రారంభించింది చేనేత, జౌళి శాఖ. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 55,000 మంది అర్హులు ఉంటారని... వారందరికీ ఏడాదికి రూ.25 వేల చొప్పున నేతన్నకు భరోసా పథకం కింద ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో ఈ పథకం కింద రూ.24000 ఇచ్చేవారు. అయితే ఇప్పుడు మరో వెయ్యి అదనంగా కార్మికులకు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు.

# ఆర్టీసీ బస్సులో మగాడి ఆత్మగౌరవ బోర్డు




- ఆర్టీసీ బస్సులో వైరల్ బోర్డు
- సోషల్ మీడియాలో నవ్వుల జల్లు
- ఏఐ ఎడిటింగ్నా? అసలు బోర్డేనా?
- మగాళ్ల ఆత్మగౌరవానికి కొత్త ట్విస్ట్
- నెటిజన్ల క్రియేటివిటీకి మరో ఉదాహరణ

# ఎయిమ్స్‌లో కొవిడ్ కలకలం




- ప్రత్యేక ఫీవర్ వార్డు ఏర్పాటు
- అప్రమత్తమైన వైద్య యంత్రాంగం
- ఆర్టీపీసీఆర్ కిట్లు సిద్ధం
- ప్రజలకు వైద్యుల సూచనలు
- జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి

# నేడు కేబినెట్ అత్యవసర సమావేశం




- సీఎం రేవంత్ అధ్యక్షతన భేటీ
- సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష
- ఎల్‌నినో ప్రభావంపై చర్చ
- మూసీ పనులపై కీలక నిర్ణయాలు
- అభివృద్ధి ప్రాజెక్టులపై దృష్టి
- సీఎస్ కీలక ఆదేశాలు

**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నేడు అత్యవసరంగా సమావేశం కానుంది. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలోని 6వ అంతస్తులో కేబినెట్ మీటింగ్ హాల్‌లో ఈ భేటీ జగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కేబినెట్ భేటీ నేపథ్యంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ప్రభుత్వ కార్యదర్శులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సీఎస్ ఆదేశించారు.


# ఉడాన్ స్కీమ్‌కు మరో 10 ఏళ్లు

- కొత్త మార్గదర్శకాల విడుదల
- 100 కొత్త విమానాశ్రయాల లక్ష్యం
- ప్రాంతీయ అనుసంధానానికి ఊతం
- వియబిలిటీ గ్యాప్ ఫండింగ్‌లో మార్పులు
- చిన్న నగరాలకు మరిన్ని విమానాలు
- విమానయాన రంగానికి కొత్త ఊపు

2 లో

# భర్తను చంపి ప్రియుడితో పారిపోయిన భార్య

- గుడి దర్శనం తర్వాత దారుణం
- భర్తపై దాడి.. అక్కడికక్కడే మృతి
- చిన్నారితో కలిసి పరార్
- సీసీటీవీలో వెలుగుచూసిన దృశ్యాలు
- ప్రియుడితో పారిపోయిన భార్య
- కేసు దర్యాప్తు ముమ్మరం




# కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయం చేస్తున్నారు

- కాళేశ్వరంపై హైకోర్టులో పిటిషన్
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక అమలుకు డిమాండ్
- కేంద్ర, రాష్ట్రాలకు హైకోర్టు నోటీసులు
- మేడిగడ్డ భద్రతపై ఆందోళన
- ప్రాజెక్టుపై రాజకీయాలు చేస్తున్నారన్న ఆరోపణ
- ఈ నెల 21కి విచారణ వాయిదా

# నేటి నుంచి రెండో విడత ఇంజనీరింగ్ అడ్మిషన్స్ కౌన్సిలింగ్

- జూలై 17 నుంచి ఫీజు చెల్లింపు, స్లాట్ బుకింగ్
- 18, 19 తేదీల్లో వెబ్ ఆప్షన్ల నమోదు
- జూలై 22న సీట్ల కేటాయింపు
- 27,487 సీట్లు అందుబాటులో
- ఖాళీ సీట్ల భర్తీకి రెండో అవకాశం

2 లో

Registered No : APTEL/25/A0818

# ఇది కద నిజం



## వైభవంగా బోనాల జాతర ప్రారంభం

**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే చారిత్రాత్మక గోల్కొండ బోనాల జాతర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఆషాఢ మాసం సందర్భంగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా, మొదటి బోనాన్ని గోల్కొండ కోటపై వెలసిన జగదాంబిక అమ్మవారికి కుమ్మరులు సమర్పించారు. సాంప్రదాయబద్ధంగా 11 బోనాలతో కోటకు చేరుకున్న భక్తులు అమ్మవారికి ఘనంగా మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి బంగారు బోనాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ ఉత్సవాల్లో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొని ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని వారు ఆకాంక్షించారు.

తొలి బోనం సమర్పణతో గోల్కొండ కోట పరిసర ప్రాంతాలన్నీ భక్తుల కోలాహలంతో, శోభాయమానంగా మారాయి. జాతరను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో భారీ ఏర్పాట్లు చేసింది. క్యూలైన్లు, తాగునీరు, భారీ భద్రతతో పాటు ట్రాఫిక్ ఆంక్షలను సైతం కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. కోట వైపు వచ్చే దారులన్నీ భక్తజన సందోహంగా మారడంతో గోల్కొండ పరిసరాలు ఆధ్యాత్మిక ఉట్టిపడేలా కనిపిస్తున్నాయి.

## బీజేపీ వస్తే బొట్టు తప్పనిసరి

మొదటి పేజీ తరువాయి

ఈసారి తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం పక్కా అని తాము అధికారంలోకి రాగానే హిందూ విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తామన్నారు. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

వదిలేస్తా రాష్ట్రమంతా విస్తరించే ప్రమాదం:

ఇటీవల ఆటో డ్రైవర్ భరత్ ను పోలీసులు, మజ్లిస్ నాయకులు వేధింపులకు గురి చేశారని భరత్ ను వేధించిన పోలీసులు, మజ్లిస్ నాయకులపై చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు. ఇలాంటి ఘటనలను చూసీ చూడనట్లు వ్యవహరిస్తే తెలంగాణ అంతటా విస్తరించే ప్రమాదం ఉందన్నారు. భరత్ రాసిన దాంట్లో తప్పేముంది? హిందువులను కించపర్చేలా ఉర్దూలో ఆటోల్లో, గోడలపై రాసుకున్న వాళ్లపై ఎందుకు కేసులు పెట్టడం లేదు? అని నిలదీశారు. మజ్లిస్ వాళ్లకో న్యాయం? భరత్ కు మరో న్యాయమా అని ప్రశ్నించారు.


## ఉడాన్ స్కీమ్‌కు మరో 10 ఏళ్లు



**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** సామాన్యులకు విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చే లక్ష్యంతో ప్రారంభించిన ప్రాంతీయ అనుసంధాన పథకం 'ఉడాన్' ను మరో 10 సంవత్సరాల పాటు పొడిగించారు. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. ఈ పథకం తదుపరి దశ అమలుపై ఢిల్లీలో నిర్వహించిన ఉన్నత స్థాయి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం దేశంలో విమానయాన రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రతి నెలా ఒక కొత్త టెర్మినల్, ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. రాబోయే 10 సంవత్సరాలలో కొత్తగా 100 విమానాశ్రయాలను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, నిర్దేశిత సమయంలోగా వీటిని పూర్తి చేయడానికి దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు 100 శాతం భాగస్వామ్యంతో పూర్తి సహకారం అందిస్తున్నాయని వెల్లడించారు.

చిన్న నగరాలకు విమాన సర్వీసులను మరింత పెంచేందుకు వీలుగా ప్రస్తుత స్కీమ్‌లోని 'వియబిలిటీ గ్యాప్ ఫండింగ్' నిబంధనల్లో కొన్ని కీలక మార్పులు చేసినట్లు మంత్రి వివరించారు. గతంలో ఒక విమానాశ్రయాన్ని 'అండర్‌సర్వ్‌డ్' గా గుర్తించాలంటే అక్కడ వారానికి 7 కంటే తక్కువ సర్వీసులు ఉండాలనే నిబంధన ఉండేదని, ఇప్పుడు ఆ పరిమితిని వారానికి 14, అంతకంటే తక్కువ సర్వీసులకు పెంచామని స్పష్టం చేశారు. ఈ మార్పు వల్ల దేశంలోని మరిన్ని విమానాశ్రయాలకు, ఎక్కువ రూట్లలో విమానాలు నడపడానికి విమానయాన సంస్థలకు కేంద్రం నుండి ఆర్థిక సహాయం అందుతుందని, తద్వారా ప్రాంతీయ అనుసంధానత ఊహించని స్థాయిలో మెరుగుపడుతుందని రామ్మోహన్ నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎయిమ్స్‌లో కొవిడ్ కలకలం



**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** మంగళగిరిలోని ప్రతిష్టాత్మక అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ఆసుపత్రిలో కరోనా కలకలం రేగింది. నిన్న కొవిడ్ అనుమానిత లక్షణాలతో ఆసుపత్రికి వచ్చిన ఒక వ్యక్తికి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం సదరు బాధితుడిని హోం ఐసోలేషన్‌లో ఉండాలని సూచిస్తూ ఇంటికి పంపించారు. ఇటీవల కాలంలో జ్వరాల బారిన పడుతున్న బాధితుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం, అలాగే కొవిడ్ లక్షణాలు కనిపిస్తుండటంతో ఎయిమ్స్ వైద్యులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. కరోనా కేసుల నమోదు నేపథ్యంలో ఎయిమ్స్ ఆసుపత్రిలో ప్రత్యేకంగా 'ఫీవర్ వార్డు'ను ఏర్పాటు చేశారు. వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు, జ్వరంతో వచ్చే రోగులకు ఇక్కడే ప్రత్యేక వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు ఎయిమ్స్‌లో కొవిడ్ కలకలం రేగడంతో గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి వైద్యులు సైతం అప్రమత్తమయ్యారు. జీజీహెచ్ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన ఆర్టీపీసీఆర్ టెస్టింగ్ కిట్లను సిద్ధంగా ఉంచారు. ప్రజలు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే జ్వరం, దగ్గు, శ్వాసకోస సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని, మాస్కులు ధరించడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఆర్టీసీ బస్సులో మగాడి ఆత్మగౌరవ బోర్డు




**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** కాలం మారింది.. ఆడవాళ్లకు ఉచిత బస్సు ప్రయాణం పెట్టినప్పటి నుంచి ఏదో ఒక రకంగా తమ క్రియేటివిటీని నిరూపించుకుంటున్నారు నెటిజన్లు. ప్రస్తుతం అదే కోవలోకి మరో అద్భుత కళాఖండం వెలుగులోకి వచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో 'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం' అని ఉండాల్సిన ఆర్టీసీ బోర్డును కాస్తా.. అక్షరాలు మార్చేసి, రాత్రికి రాత్రే 'పురుషులను గౌరవించడం మన సంప్రదాయం'గా మార్చేశారు. ప్రస్తుతం ఈ ఫొటో సూర్యాపేట రూట్ బస్సులోనిదని సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతోంది.

సోషల్ మీడియాలో తెగ వైరల్..

అయితే, 'పురుషులను గౌరవించడం మన సంప్రదాయం' అనే బోర్డు ఫొటో బయటపడటమే ఆలస్యం.. పురుష పుంగవులు ఇన్నాళ్లకు మాకు తగిన గౌరవం దక్కిందని ఆహా.. ఓహో అంటూ జబ్బలుచరుకుంటున్నారు. ఫ్రీ బస్సు ప్రయాణాలు లేకపోయినా, కనీసం ఈ బోర్డు చూసైనా సీట్ ఇస్తారేమోనని మరికొందరు మహానుభావులు తెగ మురిసిపోయారు. మరోవైపు బస్సులో కనిపించిన బోర్డు ఒరిజినల్ బోర్డు కాదని, 'స్త్రీలను' అనే పదాన్ని తీసేసి అదే స్థానంలో ఏఐ సాయంతో 'పురుషులను అనే పదం చేర్చారంటూ మరికొందరు అంటున్నారు. ఏది ఏమైనా ప్రస్తుతం ఆర్టీసీ బస్సులో కనిపిస్తున్న 'పురుషులను గౌరవించడం మన సంప్రదాయం' అనే బోర్డు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.

## నేటి నుంచి రెండో విడత ఇంజనీరింగ్ అడ్మిషన్స్ కౌన్సిలింగ్



**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ –2026 రెండో విడత ప్రవేశాల కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసింది. జూలై 17 నుంచి ఈ రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కానుంది. మొదటి విడత కౌన్సిలింగ్ ముగిసిన అనంతరం ఖాళీగా ఉన్న స్థానాలను ఈ విడత ద్వారా భర్తీ చేయనున్నారు.

ముఖ్యమైన తేదీల వివరాలు:

జూలై 17: ఆన్‌లైన్ ద్వారా ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికేట్ వెరిఫికేషన్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

జూలై 18: స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు హెల్ప్ లైన్ కేంద్రాలలో ధృవపత్రాల పరిశీలన జరుగుతుంది.

జూలై 18 నుండి 19 వరకు: అర్హులైన అభ్యర్థులు తమకు నచ్చిన కాలేజీలు, కోర్సుల ప్రాధాన్యత క్రమంలో వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు.

జూలై 22: విద్యార్థుల మెరిట్, వెబ్ ఆప్షన్ల ఆధారంగా రెండో విడత తాత్కాలిక సీట్ల కేటాయింపును ప్రకటిస్తారు.

మొదటి విడత కౌన్సిలింగ్ ముగిసిన తర్వాత భారీ సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. అధికారులు వెల్లడించిన గణాంకాల ప్రకారం మొదటి విడతలో సీట్లు పొంది, నిర్ణీత గడువులోగా కాలేజీలలో రిపోర్ట్ చేయని అభ్యర్థుల సంఖ్య 19,325 కాగా.. మొదటి విడత కౌన్సిలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత నేరుగా మిగిలిపోయిన ఖాళీ సీట్ల సంఖ్య 8,162. ఈ రెండు విభాగాలూ కలిపి రెండో విడత కౌన్సిలింగ్‌లో అభ్యర్థులకు అందుబాటులో ఉన్న మొత్తం 27,487 సీట్లు ఉన్నాయి.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయం చేస్తున్నారు




**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వాలు రాజకీయం చేస్తున్నాయని, ఈ ప్రాజెక్టును తగిన పరిమితులతో ఉపయోగించుకొనే అంశాన్ని పరిశీలించడం లేదని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల పథకంలో భాగమైన మేడిగడ్డ రిజర్వాయర్‌లో పిల్లర్ కుంగిన వ్యవహారంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికను అమలుచేయాలని పిటిషనర్ కోరారు.

ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుధవారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతోపాటు కన్నెపల్లి, సుందిళ్ల పంప్‌హౌస్‌ల రక్షణకు సంబంధించి సాంకేతిక అధ్యయనం చేపట్టి సురక్షితంగా వినియోగించే అంశంపై ప్రభుత్వాలు పట్టించుకోకపోవడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది ఎస్ శరత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు.

పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు విన్న న్యాయమూర్తి ప్రతివాదులైన కేంద్రం, ఎన్‌డీఎస్ ఏ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి, ఇంజినీర్ ఇన్ చీఫ్, తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్‌లకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేశారు.

## భర్తను చంపి ప్రియుడితో పారిపోయిన భార్య



**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** ఏపీలో దారుణం జరిగింది. ప్రియుడి మోజులో ఓ భార్య భర్తను గుడికి తీసుకువెళ్లి హత్య చేసింది. అనంతరం ప్రియుడితో కలిసి అక్కడ నుండి పారిపోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఘటన చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలంలోని మల్లప్ప కొండపై మంగళవారం చోటు చేసుకుంది. శాంతిపురం మండలం బోయనపల్లికి చెందిన ఓ మహిళతో రెండేళ్ల క్రితం తమిళనాడు సూళగిరి ప్రాంతానికి చెందిన రమేష్ కు వివాహం జరిగింది. వీరికి ప్రస్తుతం ఏడాది వయసు ఉన్న ఓ పాప ఉంది. రమేష్ భార్య వారం రోజుల క్రితం తమిళనాడు నుండి పుట్టింటికి బోయనపల్లికి వచ్చింది.

కాగా తన భార్య, బిడ్డను చూసేందుకు మంగళవారం రమేష్ అత్తారింటికి వచ్చాడు. తరవాత భార్య, బిడ్డతో కలిసి బైక్ పై రమేష్ గుడుపల్లె మండలం మల్లప్ప కొండపై ఉన్న మల్లేశ్వర స్వామి ఆలయానికి దర్శానికి వెళ్లారు. దేవుడి దర్శనం చేసుకుని కొండ దిగుతున్న సమయంలో మూడో క్రాస్ వద్ద రమేష్ ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. రమేష్ హత్య తరవాత భార్య, చిన్నారి కనిపించకుండా పోయారు.

ఘటనపై సమాచారం అందిన పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ మొదలుపెట్టారు. భార్య, చిన్నారి మిస్ అవ్వడంతో మొదట అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని విచారించారు. ఈ నేపథ్యంలో సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించగా రమేష్ భార్య తన ప్రియుడితో కలిసి బైక్ పై పరార్ అవుతున్న దృశ్యాలు కనిపించాయి. బైక్ పై మహిళతో పాటు మరో ఇద్దరు యువకులను పోలీసులు గుర్తించారు. ఘటనపై విచారణ జరుగుతున్నట్టు తెలిపారు.

## పూరీ రథయాత్రలో తొక్కిసలాట.. ఒకరు మృతి.. 120 మందికి గాయాలు



**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** ఒడిశాలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం పూరీలో జరుగుతున్న జగన్నాథుడి రథయాత్రలో గురువారం ఘోర విషాదం చోటుచేసుకుంది. జగన్నాథ రథయాత్ర చూసేందుకు భారీగా తరలివచ్చిన జనసమూహాన్ని నియంత్రించే క్రమంలో ఒక్కసారిగా తొక్కిసలాట లాంటి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఈ దుర్ఘటనలో ఒక భక్తుడు ప్రాణాలు కోల్పోగా, సుమారు 100 నుండి 120 మంది వరకు తీవ్రంగా గాయపడ్డట్టు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే ఆలయ కమిటీ, పోలీసు ఉన్నతాధికారులు అదనపు బలగాలతో రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా గత ఏడాది రథయాత్రలోనూ తొక్కిసలాట జరగగా.. 3 ముగ్గురు మృతి చెందగా, 50 మంది గాయపడ్డారు. ఈ ఏడాది కూడా అదే తరహా ప్రమాదం పునరావృతం కావడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

## రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి



ఈ పథకం అమలు కోసం బడ్జెట్ లో రూ.250 కోట్లు కూడా కేటాయించింది సర్కార్.

నేతన్నకు భరోసా పథకానికి ఎవరు అర్హులు ?

సొంత మగ్గం ఉండే చేనేత కార్మికులకు నేతన్నకు భరోసా పథకం వర్తించనుంది. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. రాట్నం వడకడం, రంగులు అద్దడం లాంటి కార్మికులకు కూడా ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ రంగాలకు సంబంధించిన వాళ్ళు దాదాపు పదివేల మంది ఉంటారని ఓ అంచనాకు కూడా వచ్చింది సర్కార్.

## నేడు కేబినెట్ అత్యవసర సమావేశం

**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నేడు అత్యవసరంగా సమావేశం కానుంది. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలోని 6వ అంతస్తులో కేబినెట్ మీటింగ్ హాల్‌లో ఈ భేటీ జగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కేబినెట్ భేటీ నేపథ్యంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, ప్రభుత్వ కార్యదర్శులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సీఎస్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ప్రధానంగా సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, మూసీ పునరుజ్జీవనం ఫేజ్–1 పనులు, వర్షాభావ పరిస్థితులు, అలాగే కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పలు అభివృద్ధి ప్రాజెక్టులపై ప్రధానంగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లుగా తెలుస్తోంది. ఇక రాష్ట్రంపై 'ఎల్‌నినో' ప్రభావం, లోటు వర్షపాతం నమోదు, రైతులకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కేబినెట్ దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఇటీవల గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు పొరుగు రాష్ట్రాలకు నోటీసులు ఇవ్వడం, కృష్ణా, గోదావరి నదీ జలాల బోర్డుల అంశాలు, ఇతర రాష్ట్రాలతో చర్చించిన అంశాలపై సమీక్షించనున్నట్లుగా తెలుస్తోంది. అయితే, రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ, పరిపాలనాపరమైన పరిణామాల నేపథ్యంలో ఈ కేబినెట్ భేటీ అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

## తల్లికి వందనం.. నిధుల వర్షం!

మొదటి పేజీ తరువాయి

ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందించనుండగా.. అందులో రూ.2 వేల చొప్పున పాఠశాలల నిర్వహణ, అభివృద్ధి కోసం కేటాయించి.. మిగిలిన రూ.13 వేల మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 22వ తేదీన తొలి విడతగా అర్హులు, అనర్హుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించనున్నారు. అదే రోజు నుంచి ఆగస్ట్ 3వ తేదీ వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరిస్తారు. ఆ తర్వాత ఆగస్ట్ 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వాటిని పరిశీలించి అదనపు అర్హుల జాబితాను సిద్ధం చేయనున్నారు.

కొత్తగా 1వ తరగతి.. 9వ తరగతి.. ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. వారి అర్హతలను పరిశీలించి ఆగస్టు 30వ తేదీన అదనపు లబ్ధిదారుల జాబితా విడుదల చేసి.. అదే రోజు వారి తల్లుల ఖాతాల్లో కూడా ఆర్థిక సాయాన్ని జమ చేయనుంది.

అలాగే ఆర్టీఈ చట్టం కింద ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా ఈ తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థుల చదువుకు ఆర్థిక భారం తగ్గించి.. ప్రతి కుటుంబానికి విద్యా భరోసా కల్పించడమే 'తల్లికి వందనం' పథకం ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## తెలంగాణ ప్రజలకు అలర్ట్.. రాగల మూడు రోజులు వర్షాలు!




**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా రాష్ట్ర రాజధాని హైదరాబాదతో పాటు పరిసర ప్రాంతాలలో సాయంత్రం, రాత్రి వేళల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. పగటిపూట ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని అంచనా వేశారు.

ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాలపై ప్రభావం..

తీవ్ర అల్పపీడన ప్రభావం ప్రధానంగా ఉత్తర, ఈశాన్య తెలంగాణ పరిధిలోని ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, హన్మకొండ, వరంగల్, సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో వర్షాలు అధికంగా ఎక్కువగా ఉండే అవకాశం వాతావరణ శాఖ అంచనా వేసింది. వర్షాల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## లిక్కర్ కేసులో కీలక పరిణామం : చంచల్‌గూడ నుంచి తరలింపు




**న్యూస్ డెస్క్, 16 జూలై (ఇది కద నిజం):** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'ఏపీ లిక్కర్ రవాణా కుంభకోణం కేసు' దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరింత వేగవంతం చేసింది. ఈ కేసులో అరెస్టయి జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న కీలక నిందితులను కోర్టు అనుమతితో ఈడీ అధికారులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. గురువారం ఉదయం నిందితులు రాజ్‌కెసిరెడ్డి, వాసుదేవరెడ్డి, సునీల్ కుమార్‌లను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ కేంద్ర కారాగారం నుంచి భారీ భద్రత నడుమ బషీర్ బాగ్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు.

ఈ కుంభకోణానికి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, అక్రమ నిధుల మళ్లింపు (మనీ లాండరింగ్) అంశాలపై ఈ ముగ్గురు నిందితులను ఈడీ అధికారులు సుదీర్ఘంగా విచారించనున్నారు. మద్యం రవాణాలో జరిగిన అక్రమాలు, ఈ వ్యవహారంలో వెనుక ఉన్న సూత్రధారులు, పాత్రధారులకు సంబంధించిన కీలక ఆధారాలను రాబట్టేందుకు అధికారులు విచారణా సరళిని సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ కస్టడీ విచారణతో ఈ కేసులో మరికొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

# శ్రీ జగన్నాథ రథయాత్రకు సిద్ధమవుతున్న అత్తాపూర్

- భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహణకు ఏర్పాట్లు
- ఈ నెల 18వ తేదీ, శనివారం నాడు రథయాత్ర వేడుకలు జరగనున్నాయి
- మధ్యాహ్నం 12:00 గంటలకు ఉత్సవం ఘనంగా ప్రారంభమవుతుంది
- మధ్యాహ్నం 1:30 నుండి సాయంత్రం 6:00 వరకు అత్తాపూర్ ప్రధాన వీధుల్లో రథయాత్ర సాగుతుంది





ఇది కద నిజం,అత్తాపూర్ : అత్తాపూర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీ జగన్నాథ రథయాత్రను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18వ తేదీ శనివారం జరగనున్న ఈ ఆధ్యాత్మిక ఉత్సవానికి భక్తులు, ఆధ్యాత్మిక ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆలయ కమిటీ పిలుపునిచ్చింది. శ్రీ జగన్నాథుని రథాన్ని కళ్లతో చూడటం వల్ల సకల పాపాలు తొలగిపోతాయని, ఈ యాత్రలో పాల్గొనడం ఒక అరుదైన ఆధ్యాత్మిక అనుభూతిని ఇస్తుందని భక్తులు విశ్వసిస్తున్నారు.

రథయాత్ర కార్యక్రమం శనివారం మధ్యాహ్నం 12 గంటలకు ఘనంగా ప్రారంభం కానుంది. మధ్యాహ్నం 1 గంటకు శ్రీ శ్రీ జగన్నాథ, బలదేవ, సుభద్ర దేవి విగ్రహాలను భక్తులు ఎంతో ఉత్సాహంతో రథంపై అధిష్టింపజేస్తారు. అనంతరం రథయాత్ర ప్రారంభమై అత్తాపూర్ పరిసరాల్లోని ప్రధాన వీధుల గుండా సాగనుంది. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడటం ఈ ఉత్సవంలో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. మధ్యాహ్నం 1:30 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రథయాత్ర వైభవంగా కొనసాగుతుంది. హరినామ సంకీర్తనలు, భజనలతో రథం ముందు భక్తులు చేసే నృత్యాలు ఆ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక శోభతో నింపనున్నాయి. దారి పొడవునా భక్తులు జగన్నాథుడికి తమ భక్తిని చాటుకుంటూ, పారవశ్యంలో మునిగిపోనున్నారు. రథయాత్ర సజావుగా సాగేందుకు నిర్వాహకులు అన్ని భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఆలయంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సమయంలో స్వామివారికి సమర్పించే 56 రకాల భోగ పదార్థాల దర్శనం, ప్రత్యేక హారతి, కీర్తనలు, మరియు ఆధ్యాత్మిక నాటక ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్ధులను చేయనున్నాయి. ఈ కార్యక్రమాలు ముగిసిన తర్వాత హాజరైన భక్తులందరికీ మహాప్రసాదం వితరణ జరగనుంది. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరుతూనే, భక్తులు తమ వంతు ఆర్థిక సహకారాన్ని అందించాలని ఇస్కాన్ అత్తాపూర్ నిర్వాహకులు కోరుతున్నారు. మరింత సమాచారం కోసం లేదా విరాళాలు సమర్పించేందుకు భక్తులు www.iskconattapur.com/rathayatra వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు. రథయాత్రను విజయవంతం చేసేందుకు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి రావాల్సిందిగా నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# కారేగంలో గాడి తప్పిన పారిశుధ్యం





ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 16: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని కారేగం గ్రామంలో పారిశుధ్య సమస్యలు తీవ్రంగా మారాయి. గ్రామంలోని తాగునీటి పైపులైన్లలో లీకేజీల కారణంగా నీరు కలుషితమవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు మురికి కాలువలు పొంగిపొర్లుతూ దుర్వాసన వెదజల్లుతున్నాయి. దోమల బెడద పెరగడంతో అంటువ్యాధుల భయం నెలకొంది. సమస్యలను వెంటనే పరిష్కరించి గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.


# ఎల్‌నీనో ప్రభావంపై రైతులకు అవగాహన



ఇది కదా నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 16: పిట్లం మండలంలోని తిమ్మానగర్ గ్రామంలో రైతులకు ఎల్‌నీనో ప్రభావం, పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్నందున తక్కువ కాలపరిమితి గల పంట రకాలను ఎంపిక చేసుకోవాలని, వరికి ప్రత్యామ్నాయంగా సోయాచిక్కుడు, మినుము, పెసర, కంది వంటి పప్పు పంటలను సాగు చేయాలని మండల వ్యవసాయ అధికారి వినోద్ సూచించారు. పంటలు నీటి ఎద్దడికి గురైతే రెండు శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయడం ద్వారా తాత్కాలికంగా ఒత్తిడిని తగ్గించవచ్చని వివరించారు. అలాగే రైతులు తమ వ్యవసాయ భూముల్లో 100 శాతం సబ్సిడీతో ఫాం పాండ్‌ల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని, నిల్వ నీటిని అవసర సమయంలో పంటలకు వినియోగించుకోవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రవీణ్, మండల వ్యవసాయ అధికారి వినోద్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# ఓటర్లకు సహాయంగా హైదరాబాద్ కాంగ్రెస్ ఎస్ఐఆర్ హెల్ప్‌లైన్ ప్రారంభం

**ఎన్యూమరేషన్ ఫారాలు, అనామలీలు, అవసరమైన పత్రాలు మరియు బిఎల్ఓ లకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక హెల్ప్‌లైన్ ద్వారా మార్గదర్శనం అందించనున్నారు**



ఇది కద నిజం,హైదరాబాద్, జూలై 16: హైదరాబాద్ నగరంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓటర్లకు సహాయం అందించేందుకు హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ గురువారం ప్రత్యేక టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్‌ను ప్రారంభించింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ పార్టీ తరఫున ప్రారంభించిన 88267 77445 హెల్ప్‌లైన్ ద్వారా అర్హులైన ఓటర్లు తమ ఓటరు నమోదు రక్షణతో పాటు ధృవీకరణ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేసుకునేందుకు అవసరమైన మార్గదర్శకత్వం పొందవచ్చు. ఈ హెల్ప్‌లైన్ ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. ఎన్యూమరేషన్ ఫారాలు, అవసరమైన పత్రాలు, ధృవీకరణ విధానం మరియు ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ఇతర సందేహాలపై ఓటర్లు ఈ నంబర్‌ను సంప్రదించవచ్చు. హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సయ్యద్ ఖాలిద్ సైఫుల్లా మాట్లాడుతూ, ముఖ్యంగా ఎన్యూమరేషన్ ఫారాలు ఎలా నింపాలో తెలియని వారు లేదా తమ బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) ఇంకా సంప్రదించని ఓటర్లకు సహాయం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారం అందని వారు లేదా బిఎల్ఓ తమ ఇంటిని సందర్శించని వారు తమ నియోజకవర్గం, పోలింగ్ స్టేషన్, నివాస ప్రాంత వివరాలను హెల్ప్‌లైన్‌కు తెలియజేయవచ్చు. పార్టీ ప్రతినిధులు వారికి అందుబాటులో ఉన్న విధానాన్ని వివరించి, అవసరమైతే స్థానిక స్థాయిలో సహాయాన్ని సమన్వయం చేస్తారు. ఫారం అందుకున్నప్పటికీ అందులోని కొన్ని కాలమ్స్, వివరాలు లేదా అవసరమైన పత్రాల గురించి సందేహాలు ఉన్న ఓటర్లకు కూడా హెల్ప్‌లైన్ ద్వారా సహాయం అందించబడుతుంది. ఫారాన్ని సరిగా నింపడం, ధృవీకరణలో ఆలస్యం కలిగించే పొరపాట్లను నివారించడం గురించి వారికి సూచనలు ఇస్తారు. ఓటరు జాబితా పరిశీలనలో అనామలీ కేటగిరీలో గుర్తించబడిన ఓటర్లకు ప్రత్యేక సహాయం అందించబడుతుంది. అనామలీకి కారణం ఏమిటి, దానిని తొలగించేందుకు అనుసరించాల్సిన విధానం ఏమిటి, గుర్తింపు, నివాసం లేదా ఇతర వివరాలను నిరూపించేందుకు అవసరమైన పత్రాలు ఏవి అనే విషయాలను హెల్ప్‌లైన్ బృందం వివరిస్తుంది. పేరు, చిరునామా, వయస్సు, కుటుంబ వివరాలు లేదా ఇతర ఎన్నికల సమాచారంలో సవరణలు చేయించుకోవాలనుకునే ఓటర్లు కూడా ప్రారంభ స్థాయి మార్గదర్శకత్వం కోసం హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చు. అయితే, ఓటరు పేరును చేర్చడం, తొలగించడం లేదా సవరించడం వంటి తుది నిర్ణయాలు సంబంధిత ఎన్నికల అధికారుల ధృవీకరణ మరియు ఆమోదానికి లోబడి ఉంటాయి. ఖాలిద్ సైఫుల్లా మాట్లాడుతూ, ఈ హెల్ప్‌లైన్ అధికారిక ఎస్ఐఆర్ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కాదని, ప్రజల్లో అవగాహన పెంచి ప్రక్రియను అర్థం చేసుకునేందుకు సహాయపడే ఒక అనుబంధ కార్యక్రమమని తెలిపారు. ఇది ఎన్నికల సంఘం, ఎన్నికల నమోదు అధికారులు లేదా బిఎల్ఓల పాత్రను భర్తీ చేయదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన విస్తృత స్థాయి నాయకత్వం భాగస్వామ్యమైంది. హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీకి చెందిన 101 మంది పదాధికారులు, 44 మంది స్థానిక యూనిట్ అధ్యక్షులు, దాదాపు 1,200 మంది బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏ) నగరవ్యాప్తంగా ఓటర్లకు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నారని పార్టీ తెలిపింది. మొదటి దశలో శిక్షణ పొందిన పార్టీ ప్రతినిధులు టెలిఫోన్ ద్వారా వచ్చిన సందేహాలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తారు. అవసరమైన విధానం, సమర్పించాల్సిన పత్రాలు మరియు సంబంధిత బిఎల్ఓ లేదా ఎన్నికల అధికారిని ఎలా సంప్రదించాలో వారు వివరిస్తారు. ఫోన్ ద్వారా సమస్య పరిష్కారం కాకపోతే, జిల్లా కాంగ్రెస్ కమిటీ తరఫున ఒక బూత్ లెవల్ ఏజెంట్ లేదా స్థానిక పార్టీ ప్రతినిధిని ఓటరు నివాసానికి పంపించి అవసరమైన ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు సహాయం అందిస్తారు. ఇంటి వద్దకే వెళ్లి అందించే ఈ సేవ ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు మరియు ఆన్‌లైన్ లేదా డాక్యుమెంటేషన్ విధానాలపై అవగాహన లేని వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పార్టీ పేర్కొంది. ఖాలిద్ సైఫుల్లా ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్లక్ష్యం చేయవద్దని, ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణను ఆలస్యం చేయవద్దని కోరారు. ప్రతి ఓటరు తమ పేరు మరియు వివరాలు ఓటరు జాబితాలో సరిగా ఉన్నాయో లేదో పరిశీలించి, నిర్ణీత గడువులో అవసరమైన ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సహాయం కావాల్సిన ఓటర్లు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు 88267 77445 నంబర్‌ను సంప్రదించవచ్చని హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు మరోసారి తెలిపారు.


# పుట్టిన గడ్డకు సేవ చేయడం గొప్ప అదృష్టం



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 16: కామారెడ్డి జిల్లా పిట్లం బాలికల ఉన్నత పాఠశాలలో సేవ్ ది గర్ల్ చైల్డ్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్లు, శానిటరీ ప్యాడ్స్ ఇన్సినిరేటర్ యంత్రాన్ని అందజేశారు. చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్ గౌడ్ స్వగ్రామమైన పిట్లం పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు రాజేంద్ర, నవాబ్ సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ పుట్టిన గడ్డకు సేవ చేసే అవకాశం కొందరికే దక్కుతుందని, శివకుమార్ గౌడ్ అలాంటి వారిలో ముందుంటారని పేర్కొన్నారు. త్వరలో పాఠశాలకు కంప్యూటర్లు అందించి కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు, పదో తరగతి ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో సంస్థ సభ్యులు స్వప్న, గీతా రెడ్డి, ప్రదీప్ రెడ్డి, వంశీకృష్ణ, బాలరాజు, రంజిత్, సాయి, ప్రధానోపాధ్యాయులు బైర్నెనీ రమణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


# సుంకరి లక్ష్మణ్ ముదిరాజ్ దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించిన ప్రముఖులు



ఇది కద నిజం:బీజేపీ సీనియర్ నాయకులు సుంకరి సాయి ప్రతాప్ ముదిరాజ్ తండ్రి, స్వర్గీయ సుంకరి లక్ష్మణ్ ముదిరాజ్ దశదిన కర్మ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం, స్వర్గీయ లక్ష్మణ్ ముదిరాజ్ సమాజానికి అందించిన సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ మంత్రి ఈటెల రాజేందర్ సహోదరుడు బద్రన్న, గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, బీజేపీ నాయకులు పులి బలరాం, నల్ల జై శంకర్ గౌడ్ మరియు పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ విషాద సమయంలో లక్ష్మణ్ ముదిరాజ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

# ఓటు హక్కు నమోదులో చురుగ్గా పాల్గొనండి


## అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సులిగే వెంకటేష్




ఇది కద నిజం, అత్తాపూర్ :అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్గూడలో గల 217, 218, 235, 236 మరియు 237 నంబర్ బూత్ కేంద్రాల వద్ద ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు సులిగే వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఓటర్లకు ఎనిమరేషన్ ఫామ్‌లను అందజేయడంతో పాటు, వారికి అవసరమైన సమాచారాన్ని అందించడానికి ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఏలు శివరాజ్ గౌడ్, మేడం రాము, ప్రవీణ్ చంద్ మరియు బి.ఎల్.ఓలు చంద్రయ్య, లత, మాధురి, వంశీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సులిగే వెంకటేష్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను గుర్తించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితాలో పేర్లు లేని వారు, చిరునామాలు మార్చుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నాయని, ఈ ప్రక్రియలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడటానికే హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన ఓటర్లందరూ తమ పేర్లను సరిచూసుకోవాలని, ఏదైనా మార్పులు ఉంటే ఫారమ్‌ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఓటర్ల నమోదు పట్ల నిర్లక్ష్యం వహించవద్దని, దేశ భవిష్యత్తును నిర్ణయించే ఓటు హక్కును పొందేందుకు అందరూ ముందుకు రావాలని వెంకటేష్ కోరారు. ఓటర్లకు ఏ విధమైన సందేహాలు ఉన్నా తమను సంప్రదించవచ్చని, తమ బృందం నిరంతరం అందుబాటులో ఉండి సహాయం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

# యర్ర శ్రీనిధి పుట్టినరోజు వేడుకలు

## కూతురు పుట్టిన రోజు సందర్భంగా మొక్కలు నాటిన కుటుంబం





ఇది కద నిజం న్యూస్, ఖమ్మం పట్టణం /జూలై 17, ఖమ్మం జిల్లా : కుమార్తె యర్ర శ్రీనిధి పుట్టినరోజు సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులు ఖమ్మం అర్బన్‌లోని ఎలుగుమట్ల అర్బన్ పార్క్‌లో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనిధి తండ్రి యర్ర రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రజా జ్యోతి జిల్లా బ్యూరో, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్ స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం చేయటం వల్ల మా కుటుంబం ఎంతో సంతోషంగా ఉండటమే కాక ఎంతో ఆనందం అనిపించింది. ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ చేస్తే చాలా బాగుంటుందని అన్నారు .పర్యావరణ కాపాడుకోవడం మన బాధ్యత, ప్రతి ఒక్క కుటుంబంలో ఏదో ఒక కార్యక్రమం జరుగుతుందని అలాంటి కార్యక్రమంలో భాగంగా ఇలాంటి మొక్కలు నాటే కార్యక్రమం చేస్తే బాగుంటుందని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (హెచ్-2843) జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, కోశాధికారి వేములకొండ రమేష్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు నల్ల రాకేష్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ పసుపులేటి శ్రీనివాస్, నగర ప్రధాన కార్యదర్శి మధు గౌడ్, టిబీజేఎ నగర అధ్యక్షుడు ఎలుగోటి వెంకట్, సహాయ కార్యదర్శి చిన్నంశెట్టి రాంబాబు, ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్, బుర్ర రాధాకృష్ణ, ఎస్.కె. సమీరా, ఫెడరేషన్ సభ్యులు, విలేకరులు, స్థానికులు పాల్గొని శ్రీనిధికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కుటుంబ సభ్యులను అభినందించారు.

# భూపాలపల్లిలో 20 లీటర్ల గుడుంబా స్వాధీనం: ఇద్దరు మహిళల అరెస్ట్



ఇది కద నిజం న్యూస్ భూపాలపల్లి : జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అక్రమ మద్యం రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం భూపాలపల్లి సీసీఎస్ బృందం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సన్‌వ్యాలీ స్కూల్ వెనుక భాగంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న సుమారు 20 లీటర్ల నాటు గుడుంబాను పోలీసులు పట్టుకున్నారు.గుడుంబాను తరలిస్తున్న భూపాలపల్లి పరిధిలోని పెద్దకుంటపల్లి తండాకు చెందిన అజ్మీరా రాజిత (40), నంగావత్ పార్వతి (38) అనే ఇద్దరు మహిళలను సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న గుడుంబాను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.జిల్లాలో అక్రమ మద్యం తయారీ,రవాణా, విక్రయాల వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారిపైనైనా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పోలీస్ యంత్రాంగం ఈ సందర్భంగా హెచ్చరించింది.

# సినిమా న్యూస్

## రక్తసిక్త లుక్‌లో ప్రభాస్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ వరుసగా భారీ సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా గడుపుతున్నారు. ఆయన నటిస్తున్న మోస్ట్ అవేటైడ్ సినిమాల్లో 'ఫౌజీ' ఒకటి. హను రాఘవపూడి దర్శకత్వంలో రాబోతున్న ఈ పీరియాడిక్ వార్ డ్రామాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రేమ, దేశభక్తి, యుద్ధం కలగలిసిన ఒక అద్భుతమైన కథతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. స్వాతంత్ర్య పోరాట సమయంలో తిరుగుబాటుదారుడిగా మారిన ఒక బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ సైనికుడి పాత్రలో ప్రభాస్ నటిస్తుండటం విశేషం. ఈ సినిమాలో డార్లింగ్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ ప్రారంభించిన చిత్రబృందం, మొదట్లో ఒక చిన్న పోస్టర్ షేర్ చేసి ఆ తర్వాత కాస్త సైలెంట్ అయిపోయింది. దీంతో ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో ప్రభాస్ అభిమానులు నిరాశ చెందుతున్నారు.

కనీసం ఒక పోస్టర్ అయినా విడుదల చేయాలంటూ సోషల్ మీడియాలో నిత్యం రిక్వెస్ట్‌లు పెట్టడం మొదలుపెట్టారు. ఫ్యాన్స్ ఆకలిని గుర్తిస్తూ దర్శకుడు హను రాఘవపూడి తాజాగా ఒక ఊహించని బిగ్ అప్‌డేట్ ఇచ్చి అందరినీ సర్‌ప్రైజ్ చేశారు. ఈ సినిమాను ఈ ఏడాది 2026 డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 2026 డిసెంబర్ 3 నుండి 'ఫౌజీ' యాత్ర థియేటర్లలో ప్రారంభం కానుందని ఆయన స్పష్టం చేశారు.కేవలం వెండితెరపైనే కాకుండా.. ధైర్యం, గౌరవం, స్వేచ్ఛను నమ్మే ప్రతి ఒక్కరి హృదయాల్లో నిలిచిపోయే ఒక అద్భుతమైన కథను చూడటానికి సిద్ధంగా ఉండాలంటూ హను రాఘవపూడి చెప్పుకొచ్చారు. ఈ రిలీజ్ డేట్ ప్రకటనతో పాటు ప్రభాస్ కొత్త లుక్‌ను కూడా విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ప్రభాస్ ఒళ్లంతా రక్తంతో తడిసి ముద్దయి, చేతిలో ఒక పెద్ద తుపాకి పట్టుకుని శవాల మధ్యలో కూర్చుని చాలా పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఈ మాస్ లుక్ ప్రభాస్ అభిమానులకు పూనకాలు తెప్పిస్తోంది. సినిమాపై అంచనాలను ఒక్కసారిగా రెట్టింపు చేసిన ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఇక అది చూసిన నెటిజన్లు అస్సలు ఊహించలేదని కామెంట్స్ చేస్తున్నారు. అలాగే డార్లింగ్ లుక్ అదిరిపోయిందని అంటున్నారు.

## 'డీసీ' డేట్ మారింది




లోకేష్ కనగరాజ్ తెలుగు, తమిళ స్టార్ హీరోల చిత్రాలకు దర్శకత్వం వహిస్తూ వరుస విజయాలు తన ఖాతాలో వేసుకుంటూ దుమ్మురేపుతున్నారు. భారీ సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్న ఆయన హీరోగా మారబోతున్నాడు. ఫుల్ బిజీగా ఉన్న ఆయన, మొదటిసారి హీరోగా బిగ్ స్క్రీన్‌పై తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. లోకేష్ కనగరాజ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా చిత్రం 'డీసీ'. 'కెప్టెన్ మిల్లర్' సినిమాతో విమర్శకుల నుంచి మంచి ప్రశంసలు అందుకున్న దర్శకుడు అరుణ్ మాతేశ్వరన్ ఈ క్రేజీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో లోకేష్ కనగరాజ్ సరసన బాలీవుడ్ బ్యూటీ వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాను అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. మొదట ఈ సినిమాను జూలై 31న థియేటర్లలో విడుదల చేయాలని చిత్రబృందం ప్లాన్ చేసింది.

లోకేష్ కనగరాజ్ నటన ఎలా ఉండబోతుందో చూడాలని అభిమానులు కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈనేపథ్యంలో.. తాజాగా, మేకర్స్ ఈ సినిమా రిలీజ్ విషయంలో ఒక బిగ్ ట్విస్ట్ ఇస్తూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ సినిమా సెన్సార్ పనులు పూర్తయ్యాయని, ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చినట్లు వెల్లడించారు. కథలో ఉన్న విపరీతమైన యాక్షన్, వైలెన్స్ కారణంగానే ఈ సర్టిఫికెట్ వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పాటు సినిమా విడుదలను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి అభిమానులకు షాక్ ఇచ్చారు. జూలై 31న రావాల్సిన ఈ సినిమా, ఇప్పుడు వారం రోజులు ఆలస్యంగా ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతున్నట్లు కన్ఫర్మ్ చేశారు. రిలీజ్ కాస్త వాయిదా పడినప్పటికీ, లోకేష్ కనగరాజ్ మార్క్ గ్యాంగ్‌స్టర్ డ్రామాకు అరుణ్ మాతేశ్వరన్ యాక్షన్ తోడవడంతో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగిపోతున్నాయి.

## అఖిల్-అభిమాని అనుబంధం

అక్కినేని అఖిల్ హీరోగా వచ్చిన లేటెస్ట్ మూవీ లెనిన్. ఎన్నో ఏళ్లుగా బిగ్గెస్ట్ హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్.. ఈ మాస్ సినిమాతో మంచి సక్సెస్ అందుకున్నారు. జూలై 10వ తేదీన రిలీజ్ అయిన ఈ సినిమా.. ఇండస్ట్రీని షేక్ చేస్తోంది. వారం రోజులు పూర్తయ్యేలోపు రూ.100 కోట్ల కలెక్షన్స్ రాబట్టే దిశగా దూసుకు వెళ్తోంది. ఈ నేపథ్యంలోనే తాజా గుంటూరులో సక్సెస్ మీట్ నిర్వహించారు.

అయితే ఈ సక్సెస్ మీట్ ప్రారంభం కాకముందే.. 'అయ్యగారే నం.1' అంటూ రచ్చ చేసిన డై హార్ట్ అభిమాని నాగరాజును కలిశాడు హీరో అఖిల్. ఈ క్రమంలో అఖిల్ ను హగ్ చేసుకుని నాగరాజు కన్నీళ్లు పెట్టుకున్నాడు. అయితే అతడిని ఓదార్చుతూ... నీ వల్లే తనకు అయ్యగారు పేరు వచ్చిందని అఖిల్ కూడా కాస్త ఎమోషనల్ అయ్యారు. వీళ్ళిద్దరికీ సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది.



## 'పోకిరి' మిడ్‌నైట్ షోలు

సూపర్ స్టార్ మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ప్రత్యేక సర్‌ప్రైజ్ సిద్ధమవుతోంది. మహేష్ కెరీర్‌లో ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన 'పోకిరి' చిత్రాన్ని మరోసారి రీ-రిలీజ్ చేయనున్న నేపథ్యంలో, తొలిసారిగా రీ-రిలీజ్‌కు స్పెషల్ మిడ్‌నైట్ షోలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




ఆగస్టు 9న మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రత్యేక మిడ్ నైట్ షోలను ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. దీంతో అభిమానులు మరోసారి థియేటర్లలో 'పోకిరి' మ్యాజిక్‌ను ఆస్వాదించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

2006లో విడుదలైన 'పోకిరి' టాలీవుడ్ ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో మహేష్ బాబుకు జోడీగా గోవా బ్యూటీ ఇలియానా నటించగా, డేరింగ్ అండ్ డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించారు. ప్రకాశ్ రాజ్, నాజర్, ఆలీ, బ్రహ్మానందం, సాయాజీ షిండే, ఆశిష్ విద్యార్థి, సుబ్బరాజు తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందించగా, వైష్ణో అకాడమీ, ఇందిరా ప్రొడక్షన్స్ బ్యానర్లపై పూరి జగన్నాథ్, మంజుల ఘట్టమనేని నిర్మాతలుగా వ్యవహరించారు.

## 'ది ప్యారడైజ్' ఆఫర్‌పై దిల్ రాజు క్లారిటీ



నేచురల్ స్టార్ నాని 'ది ప్యారడైజ్' చిత్రం గురించి నిత్యం ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంది. షూటింగ్ ప్రారంభించి చాలా రోజులే అవుతున్నప్పటికీ విడుదలకు నోచుకోలేదు. దీంతో ఈ మోస్ట్ అవేటెడ్ మూవీపై పలు పుకార్లు షికారు చేస్తున్నాయి. ముఖ్యంగా, ఈ సినిమా థియేట్రికల్ పంపిణీ హక్కులను టాలీవుడ్ స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు రూ. 110 కోట్లకు సొంతం చేసుకున్నారంటూ గట్టిగా ప్రచారం సాగుతోంది. ఈ వార్త సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారడంతో తాజాగా మూవీ మేకర్స్ దీనిపై స్పందించి అసలు నిజం వెల్లడించారు. సినిమా థియేట్రికల్ హక్కుల గురించి బయట జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని, ఆ వదంతులను ఎవరూ నమ్మవద్దని చిత్రబృందం సోషల్ మీడియా ద్వారా కోరింది. సినిమాకు సంబంధించిన ఎలాంటి అప్‌డేట్ అయినా సరే, తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల ద్వారానే స్వయంగా ప్రకటిస్తామని స్పష్టం చేసింది.



దీంతో ఈ బిజినెస్ రూమర్స్‌కు ఒక ఎండ్ కార్డ్ పడినట్లయింది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఈ భారీ యాక్షన్ డ్రామాలో నాని సరసన కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే కలెక్షన్ కింగ్ మోహన్ బాబు, సంపూర్ణేష్ బాబు, రాఘవ జుయల్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా విడుదల కొన్ని కారణాల వల్ల వాయిదా పడుతూ వస్తోంది. అయితే, ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న భారీ స్థాయిలో థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది.